క్లుప్తంగా

ఏఐఎస్ఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక



రామసముద్రం ఏఐఎస్ఎఫ్ నూతన కార్యవర్గం

రామసముద్రం: అఖిల భారతవిద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రామసముద్రం మండల నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి మదనపల్లె నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వినయ్, అన్నమయ్య జిల్లా సహాయకార్యదర్శి సురేష్, నియోజకవర్గ కార్యదర్శి మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీ సభ్యుల వివరాలు ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా మనోహర్, ప్రధాన కార్యదర్శిగా బాలయ్య, ఉపాధ్యక్షులుగా రాజేష్, శ్రీనివాసులు, వంశీ, సహాయ కార్యదర్శులు వెంకటేష్, సురేష్, కోశాధికారి సుదర్శన్ ఎన్నికైనట్లు వెల్లడించారు.

రోగులకు ఆహార పొట్లాలు పంపిణీ



ఆహారపొట్లాలను అందజేస్తున్న ఉపాధ్యాయుడు చంద్రశేఖర్

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం శంకర్ నేత్రాలయ ఉచిత కంటి వైద్య శిబిరంకు హాజరైన రోగులకు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు నామా చంద్రశేఖర్ ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి రోగులకు ఆహార పొట్లాను అందజేసినట్లు తెలిపారు. ప్రతి నెలా జరిగే ఉచిత కంటి వైద్యశిబిరంకు హాజరయ్యే వారికి ఉచితంగా ఆహార పొట్లాలను అందజేయనున్నట్లు తెలిపారు.

ఎంసీపీ పీలేరు ఇన్‌చార్జిగా వెంకటేష్



పీలేరు : మహాజన సోషలిస్టు పార్టీ పీలేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా గండికోట వెంకటేష్‌ను నియమించినట్లు ఎంఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్ మాదిగ ఓ ప్రకటనలో తెలిపారు. మాదిగల విశ్వరూప మహాసభ ప్రచారంలో భాగంగా పీలేరు నియోజకవర్గంలో మాదిగలను చైతన్య పరచడానికి కృషి చేయాలన్నారు. ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, అనుబంధ సంఘాల నాయకులను కలుపుకుని ప్రజలను చైతన్య పరిచి విశ్వరూప మహాసభకు వేలాదిగా తరలిరావడానికి కృషి చేయాలని కోరారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న గోపాల్‌రెడ్డి

మదనపల్లె : పేదలను ఆదుకోవడం, వారికి సేవచేయడంలో లభించే ఆత్మ సంతృప్తి వేల రూపాయలు ఖర్చుచేసినా లభించదని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు అడివిలోపల్లి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దిరెడ్డిగారిపల్లెలో కాల్వ రాజేష్‌రెడ్డి ప్రథమవర్ధంతి సందర్భంగా అడవిలోపల్లి గోపాల్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ దంపతులు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. సమాజంలో తోటి మనుష్యులను ఆదుకోవడం అందరి బాధ్యతని, సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాల్వ వెంకటరెడ్డి, రామకృష్ణరెడ్డి, జగదీష్‌రెడ్డి, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-1 విజేతకు సన్మానం



రాంబాబును సన్మానిస్తున్న తొగటవీరక్షత్రియ ఉద్యోగ సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్‌గా ఎంపికైన భోజనపు రాంబాబును ఆదివారం స్థానిక నీరుగట్టువారిపల్లెలో తొగట వీరక్షత్రియ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే పదోతరగతిలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించిన అనంత మల్లికార్జునను కూడా సన్మానించారు. రాంబాబు సాధించిన విజయాన్ని నేటి తరానికి స్ఫూర్తిగా నిలవాలని ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి పురం వెంకటరమణ అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డప్ప, నారాయణ, రత్నమయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్‌ను మైమరిపించేలా సర్కారు బడులు

- నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ
- గతంలో కంటే ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్య
- చదువుతో పాటు క్రమశిక్షణ, ఆరోగ్యంపై శ్రద్ధ



వాల్మీకిపురం మండలం వడ్డిపల్లె ప్రాథమిక పాఠశాల

వాల్మీకిపురం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి స్కూళ్లగా మారిపోయాయి. రెండు విడతలుగా మంజూరు అయిన నాడు-నేడు నిధులతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. కార్పొరేట్‌స్కూళ్ల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులను ప్రభుత్వం కల్పించింది. దీంతో గత నాలుగేళ్ల ముందుతో పోల్చితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం గమర్హాం.

నాడు-నేడుతో అభివృద్ధి

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు పథకం తో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో శిథిలావస్థకు చేరుకొన్న పాఠశాలలు కనుమరుగై వాటి స్థానంలో కార్పొరేట్ తరహా భవనాలు వచ్చాయి. రెండు విడతల నాడు-నేడు కింద మండలానికి రూ.9.17 కోట్లు నిధులు 41 పాఠశాలలకు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 70 శాతం పనులు పూర్తి అయ్యాయి. పాత భవనాల స్థానంలో కొత్తభవనాలతో పాటు అన్ని హంగులు చేకూరాయి.

కార్పొరేట్ తరహా వసతులు

నాడు- నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్ల స్థాయిలో వసతులను ప్రభుత్వం కల్పించింది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా కష్టాలు పడేవారు. కనీసం తాగునీరు కోసం మళ్లీ ఇళ్లకు వెళ్లేపరిస్థితి ఉండేది. అలాంటి స్థాయి నుంచి నేడు అన్ని వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించారు. తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల్లో ఫ్యాన్లు వంటి వసతులను ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది.

ప్రభుత్వ పాఠశాలల సంఖ్య	: 72
మొత్తం విద్యార్థుల సంఖ్య	:5157
2019 ముందు విద్యార్థులు	: 3867
ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో	: 5157
అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధిపొందిన వారు	: 4250
మొదటి దశ నాడు-నేడు పథకం కింద ఎంపికైన పాఠశాలలు	: 14
రెండవ దశ నాడు-నేడు పథకం కింద ఎంపికైన పాఠశాలలు	: 27
రెండు దశల్లో నాడు-నేడు కింద మంజూరైన నిధులు	: రూ.9.17 కోట్లు

యూనిఫారం, స్కూళు బ్యాగులు

గతంలో స్కూల్‌బ్యాగు, యూనిఫారం, బూట్లు వేసుకొన్నారంటే ఆపిల్లలంతా కాన్వెంట్లలల్లో చదవుకొంటున్నారని అందరికి తెలిసేది. ప్రస్తుతం ఆపరిస్థితి మారిపోయింది. యూనిఫారం, బూట్లు ప్రభుత్వ పాఠశాలల్లో చదువకొనే విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా ఇస్తోంది అనే విషయం ప్రజలకు అర్థమయ్యింది. కాన్వెంట్ తరహాలో కొత్త రకం యూనిఫారంతో పాటు నాణ్యమైన బూట్లు, ఉచితంగా పుస్తకాలు, స్కూళుబ్యాగులను ప్రస్తుతం ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సరఫరా చేసింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే ప్రతి విద్యార్థికి అన్ని వసతులను కల్పించినట్లైంది. అలాగే విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శద్ధ తీసుకొని మెరుగైన పౌష్టికాహారాన్ని అందస్తోంది.

అమ్మ ఒడితో పెరుగుతున్న ద్యార్థుల సంఖ్య

గత నాలుగేళ్ల క్రితం ఉన్న విద్యావ్యవస్థతో పోల్చితే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఒడి పథకంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరిపోతోంది. అమ్మ ఒడి పథకంతో పిల్లలకు కావాల్సిన అన్ని వసతులు ప్రభుత్వం ఇచ్చే అమ్మ ఒడి డబ్బులతోనే తల్లిదండ్రులు సమకూర్చుతున్నారు.

మండలంలో అమ్మ ఒడి పథకం ద్వారా 4250 మంది విద్యార్థులకు మొత్తం రూ. 5.36 కోట్లు లబ్ధి చేకూరింది. గతంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రయివేట్ పాఠశాలల పోటికి తట్టుకోలేక ఇళ్లకు వెళ్లి బతిమిలాడిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల పట్లపెద్దగా మెగ్గుచూపని పరిస్థితి ఉండేది. ప్రయివేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదవించడం తమ గౌరవానికి, తమ ఉన్నత స్థితికి చిహ్నంగా తల్లిదండ్రులు భావించేవారు. ప్రస్తుతం విద్యావ్యవస్థ, కార్పొరేట్ తరహ పాఠశాలభవనాలతో తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు పిల్లలను తీసుకొస్తున్నారు.

నాలుగేళ్లు అమ్మ ఒడి వస్తొంది



నాలుగేళ్లగా మాకు అమ్మ ఒడి పథకం డబ్బులు వస్తున్నాయి. దీంతో మమ్మల్ని చదవించేందుకు మా తల్లిదండ్రులు పడే కష్టాలు తీరాయి. ఎటువంటి చీకుచింతా లేకుండా అమ్మ ఒడి డబ్బులతో మాకు కావాల్సిన అన్ని వస్తువులు, సౌకర్యాలు సమకూర్చుకొంటున్నాము.

- వి. షాత్వికా, 9వ తరగతి, వాల్మీకిపురం

పుస్తకాలు, యూనిఫారం ఇస్తున్నారు



ప్రైవేట్ కాన్వెంట్ల తరహాలో ప్రభుత్వం మాకు ఉచితంగా యూనిఫారం, బూట్లు, పుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు ఇస్తొంది. కాన్వెంట్లో చదివే పిల్లల లాగా మేము కూడా చక్కని యూనిఫారంతో బడికి వెళుతున్నాము. స్కూళు బాగులో పుస్తకాలు పెట్టుకొని దర్జాగా పాఠశాలకు వెళుతుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటోంది.


- ధనుష్,8 వతరగతి, పీవీసీ జెడ్పీహైస్కూల్, వాల్మీకిపురం



ఆకట్టుకుంటున్న తరగతి గదులు



కార్పరేట్ తరహాలో విద్యార్థులకు డెస్కులు



విద్యార్థుల కోసం హ్యాండ్ వాష్ ఏర్పాటు

పార్టీ అభివృద్ధికి కృషి చేయండి

బి.కొత్తకోట: వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కోరారు. ఆదివారం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాలిక్ ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల్లో మద్దతు పెంచుకునేలా పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని, ప్రభుత్వం చేపట్టిన పథకాలపై ప్రచారం చేయాలన్నారు. ఉర్దూ స్కూల్ కమిటి చైర్మన్ ఇబ్రహిం, నక్కా మహేష్, గౌస్, సాదిక్ పాల్గొన్నారు.

నేడు టి.సదుంలో పల్లెబాట

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం పంచాయతీలో సోమవారం పల్లెబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లుత ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

రూ. 67 వేలు పలికిన గణేష్‌లడ్డూ

పీలేరు రూరల్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గణేష్ లడ్డూ రూ. 67 వేలు పలికింది. పీలేరులో ప్రతి ఏటా గణేష్ ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏట ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ప్రియ దర్శిని కళాశాలలో గణేష్‌లడ్డూ వేలం నిర్వహించారు. స్థానిక లక్ష్మీపురం గణేష్ సెంటర్ నిర్వాహకులు బాలాజి మిత్రబృందం రూ. 67 వేలు హెచ్చుపాట ద్వారా దక్కించుకున్నారు. కార్యక్రమంలో వివిధ గణేష్ సెంటర్ల నిర్వాహకులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ



బీసీఏ టాపర్ యాస్మీన్

మదనపల్లె : ఎస్వీ యూనివర్సిటీ ఆదివారం విడుదల చేసిన డిగ్రీ ఆరో సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో జ్ఞానాంబిక విద్యార్థులు విజయకేతనం ఎగురవేసినట్లు కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి తెలిపారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆరో సెమిస్టర్‌లో బీసీఏ విద్యార్థిని యాస్మీన్ 9.01 గ్రేడ్ పాయింట్లతో మొదటిస్థానం, ఏ.రవితేజ 8.86తో రెండోస్థానం సాధించారన్నారు. బీ.కాం ఫైనల్ ఇయర్‌లో డి.పవిత్ర 9.17తో మొదటి, కె.చైతన్యజ్యోతి 9.06తో రెండో స్థానం, బీబీఏలో జి.హరిప్రియ 9.12తో మొదటి, పి.దీప్తి 9.03తో రెండోస్థానంలో నిలిచారన్నారు. ఆరో సెమిస్టర్‌లో కళాశాల 9 8శాతం ఫలితాలను సాధించిందన్నారు.

జగనన్న కాలనీలో వసతుల పరిశీలన



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ సాంబశివయ్య

కలికిరి: మండలంలోని కలికిరి గ్రామ పంచాయతీ సీఎల్ఆర్‌సీ కార్యాలయ సమీపంలోని జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పన పనులను ఆదివారం హౌసింగ్ పీడీ సాంబశివయ్య పరిశీలించారు. త్వరలో ప్రారంభానికి సిద్ధమతున్న కాలనీలో పూర్తి స్థాయిలో వసతుల కల్పనకు అధికారులు పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులు కాలనీలో పర్యటించి అవసరమైన ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. కాలనీలో లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఆర్చి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. హౌసింగ్ ఈఈ వెంకటదాసు, ఏఈ రమణయ్య, కలికిరి, కేవీపల్లి మండలాల హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈలు వెంకటేష్, హరిబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రసాద్, సల్మాభాను, స్వర్ణకుమారి, కొండప్ప, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు వ్యతిరేకంగా సీపీఎం సమరభేరి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మదనపల్లె : అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్ భారాలతో ప్రజలను దోచుకుతింటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమరభేరి పేరుతో ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక టమాటా మార్కెట్‌యార్డు ముందు సీపీఎం సమరభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రం విధిస్తున్న షరతులకు తలొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు భారం మోపుతోందన్నారు. ప్రపంచ బ్యాంకు షరతులను కేంద్రం అమలు చేస్తూ రాష్ట్రాలపైనా రుద్దుతోందన్నారు. రాష్ట్రం అప్పుల కోసం కేంద్రం విధించిన షరతులన్నీ అమలుచేస్తోందని, దీనివల్ల సామాన్యప్రజలపై మోయలేని భారాలు పడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్‌చార్జీల విషయంలో రాష్ట్రప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తోందన్నారు. పెద్ద ఎత్తున భారం పడుతుండటంతో పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. అధిక ధరలకు, ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు జిల్లావ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేస్తామన్నారు. 30,31 తేదీల్లో ప్రచారం, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. 4న అన్ని మండల కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రజా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏ.వెంకటేష్, నాగరాజు, రామకృష్ణ, భాస్కర తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం



ఆలయ నిర్మాణానికి నిధులు అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న గుంటి గంగమ్మ ఆలయ నిర్మాణానికి ఎంపి మిథున్ రెడ్డి అందించిన రూ.50వేల నిధులను ఎమ్మెల్యే గ్రామస్తులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధితో పాటు ఆలయాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానలీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఓరుగంటి రమేష్, లక్ష్మినారాయణ రెడ్డి, చెంగల్ రెడ్డి, శ్రీరాములు, చిన్నప్ప, సురేంద్ర, గంగులప్ప, ఫారుఖ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కలకడలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యటన

కలకడ : ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మండలంలోని కె.బాటవారిపల్లె, కలకడ, కదిరాయచెర్వు, నడిమిచెర్ల, గుడిబండ పంచాయతీలలో పర్యటించారు. ఆదివారం సాయంత్రం కె.బాటవారిపల్లె మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళ్ళు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలకడ మాజీ సర్పంచ్ ఫైరోజషబ్బీర్‌అహమ్మద్ ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కదిరాయచెర్వు లోని మాజీ సింగల్‌విండో అధ్యక్షులు మల్లికార్జునశెట్టి చిత్రపటానికి నివాళి అర్పించారు. అలాగే నడిమిచెర్ల పంచాయతీలోని మాజీ సర్పంచ్ రాజారెడ్డి, నాగమోహన్‌రెడ్డిలను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు సుమిత్రమ్మను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నాయకులు పొత్తూరి శ్రీకాంత్‌నాయుడు, కోటి, విశ్వనాథ్‌శెట్టి, వెంకట్రమణ, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతంపై దిశానిర్దేశం

కలికిరి: క్షేత్ర స్థాయిలో బీజేపీ బలోపేతంపై ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా కలికిరికి విచ్చేసిన ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం పుంగనూరు, పీలేరు, రాయచోటి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు అవలంభించాల్సిన కార్యచరణను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకెళ్లాలని ఆదేశించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఫిర్యాదు



కలకడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కలకడ : శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని పీలేరు నయోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిరంజీవియాదవ్, వైఎస్సార్ సీపీ మండలశాఖ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఈమేరకు ఎస్ఐ తిప్పేస్వామికి ఫిర్యాదు అందజేశారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు, రాష్ట్రశాఖ అధ్యక్షుడు అచ్చంనాయుడు, నారా లోకేష్ రెచ్చగొట్టి గొడవలు సృష్టించే విధంగా ప్రసంగించడం, ఆ పార్టీ కార్యకర్తలను ఉసిగొల్పి సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై బురదజల్లే విధంగా చేయడం మంచికాదన్నారు. అలాంటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతువిభాగం కన్వీనర్ కత్తి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్‌కు పరామర్శ



నల్లారి తిమ్మారెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల తదితరులు

కలికిరి: మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి ఇటీవల నగిరిపల్లిలోని తన నివాసం వద్ద ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు. చికిత్స అనంతరం విశ్రాంతి పొందుతున్న ఆయనను ఆదివారం రాత్రి రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి పరామర్శించారు. ఆరోగ్యంపై శ్రద్ధవహించి త్వరగా పూర్తి స్థాయిలో కోలుకోవాలన్నారు. ఏపీఎండీసీ డైరెక్టరు సి.హరీష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్‌రెడ్డి వీరి వెంకట పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ ఆయుధంలాంటిది



మాట్లాడుతున్న మోటివేషన్ స్పీకర్ రామ్మూర్తి

గుర్రంకొండ: విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ అనేవి ఆయుధాల్లాంటివని మదనపల్లె పోలీస్‌శాఖ మోటివేషన్ స్పీకర్ రామ్మూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో రీడో సేవాసంస్థ ఆధ్వర్యంలో యువభారత్ ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటి తరం విద్యార్థులకు పట్టుదల, క్రమశిక్షణ, అంకితభావం, చదువుకోవాలనే తపన ఉంటే భవిష్యత్‌లో మంచి ఉన్నతస్థితికి చేరుకొంటారన్నారు. ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఎదైనా సాధించవచ్చన్నారు. చంద్రయాన్-3 విజయవంతంలో మహిళలు ఎంతో ముఖ్యపాత్ర పోషించారన్నారు. సమావేశంలో రీడో సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు అబూబకర్, అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పొలిమేర దేవర



పొలిమేర్లలో పూజలు నిర్వహించిన దృశ్యం

వాల్మీకిపురం: పట్టణ పడమర పొలిమేర్లలో ఆదివారం పొలిమేర్ల దేవరను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం మంగళ వాయిద్యాల నడుమ పూజా సామగ్రితో పొలిమేర్ల వద్దకు చేరుకొని గంగమ్మకు విశేష పూజలు నిర్వహించి, వర్షాలు కురవాలని అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాభిషేకం తదితర విశేష కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పొలిమేర్లలో పడి ఉన్న పాత రోళ్లు, ఇసుర రాళ్లు తదితర వాటికి పూజలు నిర్వహించి తూర్పు పొలిమేర వద్దకు తరలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత రోళ్లు, ఇసుర రాళ్లను సైతం ట్రాక్టర్లలో తరలించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొర్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ నీళ్లభాస్కర్, ఆనంద శెట్టి, బలరాం, రమణా రెడ్డి, పులి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్తజనసందోహంతో కిటకిటలాడింది. శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదానం నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకొన్నారు.